క్లుప్తంగా

నేడు నిడమర్రులో ప్రజాదీవెన

కృత్తివెన్ను: నిడమర్రు పంచాయతీలో బుధవారం ఉదయం ప్రజాదీవెన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ కార్యాలయం సిబ్బంది మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, వైఎస్సార్ సీపీ పెడన అసెంబ్లీ అభ్యర్థి ఉప్పాల రాము పాల్గొంటారని పేర్కొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన



కోసూరువారిపాలెం(మోపిదేవి): కోసూరువారిపాలెంలో మొక్కజొన్న పంటను వ్యవసాయాధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్(డీడీఏ) కె. జ్యోతి మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో తీసుకోవలసిన, పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ కె. శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి కె. హెప్సిబారాణి, గ్రామ ఉద్యానసహాయకులు యు శ్రీజ, మండల వ్యవసాయ అడ్వైజరీ బోర్డు చైర్మన్ మత్తి వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించండి



పెడన: ఎన్నికల నియమావళిని అందరూ తప్పనిసరిగా పాటించాలని, జెండా దిమ్మెలు, ఇళ్లపై పార్టీ జెండాలు ఉండకూడదని మునిసిపల్ కమిషనర్ బి. వెంకటరామయ్య అన్నారు. ఆయన పట్టణంలో మంగళవారం విస్తృతంగా పర్యటించి వివిధ రాజకీయ పార్టీల జెండా దిమ్మెలను కనిపించకుండా వస్త్రాలను, ప్లాస్టిక్ కవర్లను కప్పి తాళ్లతో కట్టించారు. మరికొన్ని దిమ్మెలకు తెలుపు రంగు వేయించారు. పలు చోట్ల హోర్డింగులను తీయించారు. ఆయనతో పాటు టీపీవో ఏసుబాబు, ప్లానింగ్ కార్యదర్శి జితేంద్ర తదితరులున్నారు.

చిట్టూర్పు(ఘంటసాల): మండల పరిధిలోని చిట్టూర్పు గ్రామంలో వివిధ పార్టీల ఫ్లెక్సీ బ్యానర్లను, హోర్డింగ్‌లను తొలగించడంతో పాటు విగ్రహాలకు ముసుగులు వేశారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపి శిబిరం



గూడూరు: గూడూరులోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలున్న చిన్నారులకు మంగళవారం ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ఫిజియోథెరపిస్ట్ పి.ఎస్.ఎస్.సూర్య ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని మండల విద్యాశాఖ అధికారులు బీఎస్‌సీ శేఖర్‌సింగ్, పి.సుబ్రహ్మణ్యం పరిశీలించారు. శిబిరంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగులకు ఫిజియోథెరపీ చేశారు. ఐఈఆర్పీ పి.రమాదేవి, దివ్యాంగులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభివృద్ధి బాట

- కాలేఖాన్‌పేటలో రూ. 1.55 కోట్లతో రోడ్లు, డ్రెయిన్ల ఏర్పాటు
- రూ. 86.91 లక్షలతో పాఠశాలలకు అదనపు హంగులు
- రూ. 9.20 లక్షలతో పైప్‌లైన్లు
- పేదలకు నివేశన స్థలాలు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్‌లో కాలేఖాన్‌పేట ప్రాంతం అభివృద్ధి బాటలో పయనిస్తోంది. సంక్షేమ పథకాలు, మరోవైపు అభివృద్ధి పనులతో డివిజన్ ముందుకెళ్తోంది. డివిజన్‌లో కోట్లాది రూపాయలతో డ్రెయిన్లు, రహదారులను అభివృద్ధి చేశారు.

డివిజన్‌లో 25 డీబీటీ పథకాల ద్వారా 5,058 మంది లబ్ధిదారులకు రూ. 15.77 కోట్లు, నాన్‌డీబీటీ ద్వారా 2,033 మంది లబ్ధిదారులకు రూ. 10.65 కోట్లు లబ్ధి చేకూరింది. మొత్తంగా రూ. 25.82 కోట్ల మేర లబ్ధి చేకూరింది.

డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణం

డివిజన్‌లో రూ. 1.55 కోట్లతో సిమెంటు రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపట్టారు. డివిజన్‌లో ఏడు సిమెంటు రోడ్లను రూ. 1.08 కోట్లతో నిర్మించారు. కాలేఖాన్‌పేట మురుగుకాలువ నుంచి చిన్నాపురం ప్రధాన రహదారికి రెండువైపులా రూ. 47 లక్షలతో పక్కా డ్రెయిన్లు నిర్మించారు. ఈ పనులతో డివిజన్‌లో చాలా వరకు మౌలిక వసతుల కల్పన పూర్తైంది. డివిజన్‌లో 25 నూతన విద్యుత్ స్తంభాలు వేసి 20 వీధి దీపాలను బిగించారు. రూ. 9.20 లక్షలతో పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు. రూ. 200కే బీపీఎల్ కుళాయి కనెక్షన్లు 30, జనరల్ కుళాయి కనెక్షన్లు 10 ఇచ్చారు.



కొత్త సొబగులతో కాలేఖాన్‌పేట ప్రైమరీ పాఠశాల

304 మందికి నివేశన స్థలాలు

డివిజన్‌కు సంబంధించి 304 మంది లబ్ధిదారులకు రుద్రవరంలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల పట్టాలు అందజేశారు. ఇప్పటికే 30 మంది పక్కా గృహాలు నిర్మించుకుని నివసిస్తున్నారు.

నాడు–నేడు నిధులతో పాఠశాలల అభివృద్ధి

కాలేఖాన్‌పేటలోని జీవీఎస్‌ఆర్ మునిసిపల్ హైస్కూల్, ప్రైమరీ స్కూల్ అభివృద్ధి పనులు చేపట్టడంతో కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా మారాయి. హైస్కూల్‌లో రూ. 68.65 కోట్లతో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, శిథిల భవనాల మరమ్మతులు, పాఠశాల స్వాగత ద్వారం, ప్రహరీ తదితర పనులు చేశారు. గతంలో ఈ పాఠశాలకు ప్రహరీ లేకపోవటం, పల్లంగా ఉండటంతో విద్యార్థులకు రక్షణ ఉండేది కాదు. నాడు – నేడు పథకం ద్వారా ప్రహరీ, పాఠశాల అభివృద్ధి పనులు చేపట్టారు. గతంలో స్థానిక ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) సొంత నిధులతో పాఠశాల మెరక పనులు నిర్వహించారు.



కోట్లాది రూపాయల నిధులతో హంగుల ఏర్పాటు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ప్రత్యేక కృషితో మా డివిజన్ ఎంతో అభివృద్ధి చెందింది. కోట్లాది రూపాయల నిధులు కేటాయించటంతో సిమెంటు రోడ్లు, పక్కా డ్రెయిన్లు, పైప్‌లైన్ ఏర్పాటు చేయగలిగాం. డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూశాం.

–మిరియాల బసవపూర్ణమ్మ, 30వ డివిజన్ కార్పొరేటర్



కాలేఖాన్‌పేట హైస్కూల్ ముఖద్వారం, పాఠశాల ఆవరణ



పేటలోని ఓ వీధిలో సిమెంట్ రోడ్డు



కాలేఖాన్‌పేట హైస్కూల్‌లో ఓ భాగం

లింగ నిర్ధారణకు పాల్పడితే క్రిమినల్ కేసులు

కలెక్టర్ రాజాబాబు



చిలకలపూడి(మచిలీపట్నం): లింగ నిర్ధారణకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ పి.రాజాబాబు హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో మంగళవారం సాయంత్రం పీసీపీఎన్‌డీటీ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్పీ నయీం అస్మీతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా తనిఖీలు చేయాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో డెలివరీ అయిన పిల్లల బర్త్ సర్టిఫికెట్ తల్లిదండ్రులకు త్వరగా అందించేలా చూడాలన్నారు. జిల్లాలో జరుగుతున్న అబార్షన్లపై ఎప్పటికప్పుడు వైద్యాధికారులు సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. బాల్యవివాహాలపై నిఘా ఉంచాలన్నారు. ఇందుకోసం మహిళా పోలీస్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంల సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసేందుకు ఆరు స్కానింగ్ సెంటర్లకు, రెన్యువల్ కోసం మరో ఆరు స్కానింగ్ కేంద్రాలకు, మూడు సహాయ పునరుత్పత్తి కేంద్రాలకు ఆమోదం తెలిపారు. సమావేశంలో 6వ అదనపు జిల్లా న్యాయమూర్తి చిన్నబాబు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ గీతాబాయి, గైనకాలజిస్ట్ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే కరపత్రాలు, పోస్టర్లు

చిలకలపూడి(మచిలీపట్నం): ఎన్నికల నిబంధనల ప్రకారం కరపత్రాలు, పోస్టర్లు మొదలైన వాటిని ముద్రించాలని కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో పబ్లిషర్లు, ప్రింటర్లతో మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కరపత్రాలు, పోస్టర్లు మొదలైన పత్రాలను ప్రింటింగ్ చేసేటప్పుడు పబ్లిషర్ అడ్రస్సుతో పాటు ప్రతుల సంఖ్య తప్పనిసరిగా ముద్రించాలన్నారు. వ్యక్తిగత విమర్శలు, వ్యక్తిగత దూషణలతో కుల, మత, ప్రాంత విభేదాలు సృష్టించే కరపత్రాలు ముద్రించకూడదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి ఆరు నెలల జైలు శిక్ష, రూ. 2వేలు జరిమానా విధించవచ్చని చెప్పారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ మాట్లాడుతూ అభ్యర్థుల ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు, హోర్డింగ్స్, ఫ్లెక్సీలు, స్టిక్కర్లు ముద్రణ చేసిన వివరాలు మూడు రోజుల్లో ఎన్నికల అధికారులకు సమర్పించాలన్నారు. సమావేశానికి విచ్చేసిన ప్రింటర్లకు నోటీసులు జారీ చేశామని, వీటిలోని అంశాలను క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకోవాలన్నారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులు ఎం.వాణి, పి.పద్మావతి, దాసి రాజు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు చిత్రంలో జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు

కష్టపడి పని చేసేవారికి గుర్తింపు

కోనేరుసెంటర్: వైఎస్సార్ సీపీలో పని చేసేవారికి గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ బందరు అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కిట్టు చెప్పారు. బందరు మండలం పెదకరగ్రహారం పంచాయతీ పరిధిలోని క్యాంపుబెల్‌పేటకు చెందిన సుమారు 50 కుటుంబాలకు చెందిన మత్స్యకారులు సోమవారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. అలాగే సుల్తానగరంలో టీడీపీకి చెందిన మరో 30 కుటుంబాలు పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా పార్టీలో చేరిన పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ పేదల కోసం అమలుచేస్తున్న పథకాలు, సంక్షేమంపై ఆకర్షితులమవుతున్నామన్నారు. నియోజకవర్గంలో పార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేయబోతున్న పేర్ని కిట్టు ప్రజా సమస్యలపై స్పందిస్తున్న తీరు, ఆయన తండ్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) ఇప్పటి వరకు తమ కోసం పడిన కష్టం పట్ల ఆకర్షితులమై వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు చెప్పారు. అనంతరం పేర్ని కిట్టు మాట్లాడుతూ నేతలు, కార్యకర్తలు సైనికుల్లా పని చేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. చిప్పల పండు, వెంకటేశ్వరరావు, పాండురంగారావు, దివాకర్, కృష్ణమూర్తి, మహేంద్ర, వర్మ, వెంకటేశ్వరమ్మ, శ్రీనివాసరావు, వెంకటేశ్వరమ్మ, లక్ష్మి, అరుణ, రోహిత్, సౌజన్య, నరసింహారావు, రాజు, చంద్రలంకమ్మ, వెంకన్నబాబులతో పాటు వారి కుటుంబాల్లోనివారు పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ శొంఠి ఫరీద్, మాజీ జెడ్పీటీసీ లంకే వెంకటేశ్వరరావు, అర్బన్ బ్యాంకు చైర్మన్ బొర్రా విఠల్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ కార్యకర్తలకు కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న పేర్ని కిట్టు

అర్చక కుటుంబంలో విషాదం

కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే రమేష్ పరామర్శ



మోపిదేవి: అల్లారి ముద్దుగా పెంచుకుంటున్న కుమారుడు అర్ధాంతరంగా కళ్ల ముందే తల్లిదండ్రులను వీడిపోవడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపించింది. మోపిదేవి దేవస్థానం ప్రధాన అర్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మ సోదరుడు బుద్దు సతీష్ శర్మ కుమారుడు కార్తీక్(14) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. సమాచారం తెలిసిన వెంటనే అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు.. బాలుడి మృతదేహాన్ని సందర్శించి తల్లిదండ్రులను ఓదార్చారు. అవనిగడ్డలో 6వ తరగతి చదువుకుంటున్న కార్తీక్ సోమవారం సాయంత్రం అనారోగ్యానికి గురికావడంతో వెంటనే చల్లపల్లిలోని ఓ ఆస్పత్రికి తీసుకువెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అక్కడ చికిత్స అనంతరం రాత్రి ఇంటికి తీసుకురాగా తెల్లవారుజామున గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. అక్కడకు చేరుకున్న స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మృతదేహం వద్ద నివాళులర్పించారు.

బాబాయ్ ఆశీర్వదించండి.. అందుబాటులో ఉంటా..

'గడప గడప'లో వైఎస్సార్ సీపీ బందరు అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: బాబాయ్ బాగున్నావా.. ఆరోగ్యం ఎలా ఉంది.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో వచ్చే ఎన్నికల్లో పార్టీ తరఫున మీ బిడ్డగా బరిలోకి దిగుతున్నాను... ఆశీర్వదించండి అనుక్షణం మీ అందరికీ అందుబాటులో ఉంటా.. అంటూ వైఎస్సార్ సీపీ బందరు అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కిట్టు ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ మండలంలోని చిన్నాపురం గ్రామంలో 'గడప గడపకు' వెళ్లారు. అవ్వా తాతలు... అక్కాచెల్లెమ్మలు, అన్నా వదినలను ప్రేమతో పలకరిస్తూ ముందుకు సాగారు. గ్రామంలో సమస్యలపై ఆరా తీశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేదల కోసం చేపట్టిన పథకాలు, సంక్షేమం నచ్చినట్లైతే మరోసారి ఆయన్ని ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. ముఖ్యమంత్రిగా ఒక్కసారి అవకాశం ఇస్తే ప్రజలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన జగన్‌మోహన్‌రెడ్డి రెండో అవకాశం ఇస్తే ప్రజల కోసం ఇంకెన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తారో ఒక్కసారి ఆలోచించి ఎన్నికల్లో నిర్ణయం తీసుకోవాలని సూచించారు. మీ బిడ్డగా ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను నిండు మనసుతో ఆశీర్వదించి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ శొంఠి ఫరీద్, చిన్నాపురం ఇన్‌చార్జ్ సుబ్రహ్మణ్యం, విత్తంశెట్టి వెంకు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చిన్నాపురంలో ఇంటింటికీ వెళ్లి పలకరిస్తున్న పేర్ని కిట్టు

ఆంజనేయుడికి తమలపాకుల పూజ

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఈడేపల్లి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం తమలపాకులతో పూజలు చేశారు. భక్తుడు గుంటుపల్లి బాబూరావు ఏర్పాటు చేసిన పానకాన్ని భక్తులకు పంపిణీ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

అంకమ్మతల్లి ఆలయంలో దేవీ హోమం

పామర్రు: స్థానిక విజయవాడ రోడ్డులోని అంకమ్మతల్లి ఆలయంలో దేవీ హోమం మంగళవారం నిర్వహించారు. తొలుత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజాదికాలను చేశారు. తదుపరి ఆలయ ప్రాంగణంలో భక్తులతో దేవీహోమాన్ని జరిపించారు. అనంతరం కొర్రపాటి విజయలక్ష్మి, శ్రీనివాస్, శ్రీదేవి, గాయత్రి, షణ్ముఖ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించామని ఆలయ కమిటీ అధ్యక్షుడు వరదా అప్పారావు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

మచిలీపట్నంటౌన్: ఆర్టీసీ మచిలీపట్నం డిపో పరిధిలో ప్రజారవాణా సమస్యలను పరిష్కరించడానికి ఈ నెల 20వ తేదీ బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం టి.పెద్దిరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రయాణికులు సమస్యలను, సలహాలను తెలియజేయాలని, 9959225462 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

రెండో రోజు ప్రశాంతంగా 'పది' పరీక్షలు



ఘంటసాల జెడ్పీ హైస్కూల్లో హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న పోలీసులు

ఘంటసాల: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఘంటసాల మండలంలో ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయి. ఘంటసాల జెడ్పీ హైస్కూల్లో రెండో రోజు మంగళవారం హిందీ పరీక్షకు 80 మంది విద్యార్థులకు 78 మంది హాజరైనట్లు పరీక్ష అధికారి నాగమణి తెలిపారు. మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 237 మందికి 232 మంది హాజరు కాగా, ఐదుగురు గైర్హాజరైనట్లు ఎంఈవోలు 1,2 శివశంకరరావు, మోమిన్‌లు తెలిపారు.

స్క్వాడ్ బృందం ఘంటసాల మండలంలోని శ్రీకాకుళం, కొడాలి, ఘంటసాల జెడ్పీ హైస్కూల్లోని పరీక్ష కేంద్రాలను మంగళవారం తనఖీ చేశారు. అక్కడ సౌకర్యాలు, పరీక్షల నిర్వహణ, భద్రత ఏర్పాట్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

పెడన: మండలంలోని ఐదు కేంద్రాల్లో 744 మందికి 707 మంది హాజరయ్యారని, 37 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో–2 హరనాథ్ తెలిపారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు.

మోపిదేవి: మోపిదేవి జెడ్పీ పాఠశాలలో 177 మందికి 8 మంది గైర్హాజరు కాగా, 169 మంది హాజరయ్యారు. స్థానిక గురుకుల పాఠశాలలో 71 మందికి అందరూ హాజరయ్యారు. పెదకళ్లేపల్లి జెడ్పీ పాఠశాలలో 94 మందికి ఒకరు గైర్హాజరు కాగా 93 మంది విద్యార్థులు హాజరయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ తెలిపారు.

కృత్తివెన్ను: మండలంలో మంగళవారం జరిగిన హిందీ పరీక్షకు 388 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో ప్రసాద్ తెలిపారు.

మచిలీపట్నంటౌన్: నియోజకవర్గంలో 2,397 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 2,341 మంది హాజరు కాగా 56 మంది పరీక్షకు హాజరుకాలేదు.

అవనిగడ్డ: అవనిగడ్డలో ఏర్పాటు చేసిన మూడు కేంద్రాల్లో 584 విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, హిందీ పరీక్షకు ఆరుగురు గైర్హాజరు అయినట్టు ఎంఈవో ఎస్.శివశంకరరావు తెలిపారు.

చేసిన అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, వైఎస్సార్ సీపీ పెడన అభ్యర్థి ఉప్పాల రాము



స్థానికులకు శాలువా కప్పుతున్న రాము, చిత్రంలో హారిక

గూడూరు: వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి జగనన్నను ఆశీర్వదించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, వైఎస్సార్ సీపీ పెడన అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము) ప్రజలను కోరారు. ప్రజాదీవెన యాత్రలో భాగంగా మద్దిపట్ల, కంచాకోడూరు గ్రామాల్లో హారిక, రాము ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో వేగంగా దూసుకుపోతోందన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని తు.చ. తప్పకుండా నెరవేర్చుకుంటూ జగనన్న రాష్ట్రంలో సుస్థిర పాలన సాగించారన్నారు.

గ్రామాల అభివృద్ధి

జగనన్న పాలనలో జొన్నల రేవు నుంచి కంచాకోడూరు మీదుగా మద్దిపట్ల వరకు పూర్తి స్థాయిలో బీటీ రోడ్డు నిర్మాణం, విస్తరణ చేశారన్నారు. కంచాకోడూరులో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రాల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. గ్రామాల్లో మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు చేసి ప్రతి గడపకు ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ సరఫరా చేయడానికి జెడ్పీ నిధులు మంజూరు చేశామన్నారు. వేసవిలోగా ప్రతి వీధి కుళాయి ద్వారా స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అవుతుందన్నారు. వలంటీరు వ్యవస్థ ద్వారా ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించిన ఏకైక నాయకుడు జగనన్న మాత్రమే అన్నారు. గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి జగనన్నను నిండు మనస్సుతో ఆశీర్వదించి వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్‌రంగబాబు, పీఏసీఎస్ చైర్మన్ కోళ్ల బాలకృష్ణ, నేతలు గొరిపర్తి రవికుమార్, కారుమంచి కామేశ్వరరావు, సర్పంచులు కోళ్ల హనుమంతరావు, బత్తిన సరిత, ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు పాల్గొన్నారు.